ఆంధ్రజ్యోతి



ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడు చేసుకుని పరీక్షలకు హాజరుకావచ్చు
- జిల్లాలో 92 పరీక్షా కేంద్రాలు.. కేంద్రాల వద్ద 144 సెక్షన్
- 8.30 గంటలకే కేంద్రాల్లోకి అనుమతి.. 9 గంటల తరువాత నోఎంట్రీ


మాట్లాడుతున్న జీకే జుబేర్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 24: ఇంటర్ పరీక్షలకు జిల్లాలో విస్తృత ఏర్పాట్లు చేశామని, నెట్ నుంచి డౌన్‌లోడు చేసుకున్న హాల్‌టిక్కెట్లతో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యే అవకాశం కల్పించామని ఇంటర్ బోర్డు ఆర్ఐవో జీకే జుబేర్ వెల్లడించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై ఆర్ఐవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జుబేర్ మాట్లాడారు. మార్చి 1 నుంచి ప్రారంభం అయ్యే పరీక్షలకు మొదటి సంవత్సరం విద్యార్థులు 27,605 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 31,830 మంది చొప్పున మొత్తం 59,435 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షల కోసం జిల్లాలో మొత్తం 92 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని ఇందులో 19 కొత్త కేంద్రాలకు ఈ ఏడాది అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు, కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని ఇప్పటికే పోలీసుశాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. పరీక్షల కోసం మొత్తం 1,750 మందికి ఇన్విజిలేషన్ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారని విద్యార్థులను ఉదయం 8.30 నుంచే కేంద్రాల్లోకి అనుతిస్తామని, 9 గంటలు దాటిన తరువాత కేంద్రాల్లోకి అనుతించమని స్పష్టం చేశారు. కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్ వద్ద తప్ప ఏ ఒక్కరి వద్ద సెల్‌ఫోన్స్ ఉండకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో డీఈసీ సభ్యులు బాలమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మంగళగిరి కోసం అంతా కలిసిరండి

మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ పిలుపు ● పలువురు తటస్థ ప్రముఖులతో యువనేత భేటీ ● కాజ గ్రామంలో పార్టీ కార్యాలయం ప్రారంభం




తాడేపల్లిలో పాస్టర్ న్యూమన్ కుటుంబ సభ్యులతో. తాడేపల్లిలో పఠాన్ అబ్బాస్ ఖాన్ కుటుంబ సభ్యులతో, మంగళగిరి పర్యటనలో భాగంగా దివ్యాంగులతో నారా లోకేశ్

మంగళగిరి, ఫిబ్రవరి 24: మంగళగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాల ప్రజలు కలిసిరావాలని మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని పలువురు తటస్థ ప్రముఖులను శనివారం రాత్రి ఆయన కలుసుకున్నారు. తొలుత తాడేపల్లి 8వ వార్డుకు చెందిన పాస్టర్ కోలా న్యూమన్ నివాసానికి వెళ్లగా కుటుంబ సభ్యులు లోకేశ్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు. రాష్ట్ర వ్యాపితంగా క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూమన్ విజ్ఞప్తి చేశారు. లోకేశ్ మాట్లాడుతూ యువగళం పాదయాత్ర సమయంలో క్రిస్టియన్ మైనార్టీల సమస్యలను తాను స్వయంగా అధ్యయనం చేశానని చెప్పారు. పాస్టర్లకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతోపాటు క్రిస్టియన్ మైనార్టీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం తాడేపల్లికి చెందిన పఠాన్ అబ్బాస్‌ఖాన్ ఇంటికి వెళ్లారు. గత ప్రభుత్వంలో దుల్హన్, రంజాన్ తోఫా వంటి పథకాలను అమలు చేస్తే వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటిని రద్దు చేసిందని గుర్తుచేశారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మైనార్టీ సోదరులను కడుపులో పెట్టుకుని చూసుకుంటుందని, గత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీ పునరుద్ధరిస్తామని చెప్పారు. అనంతరం మంగళగిరిలో ప్రణవి ఆర్థో కేర్ సెంటరు అధినేత తోట శ్రీనివాస రాఘవను వారి నివాసంలో కలుసుకున్నారు. మంగళగిరి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నందుకు లోకేశ్ అభినందనలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఆరోగ్య సేవల కోసం ఎన్టీఆర్ ఆరోగ్య రథాలను ఏర్పాటు చేశామని, రాబోయే రోజుల్లో వైద్య సేవలను విస్తృతం చేసేందుకు తమ వంతు సహాయ సహకారాలను అందించాలని కోరారు. చివరిగా మంగళగిరికి చెందిన కొటికలపూడి శ్రీనివాసరావును కలుసుకున్నారు. శ్రీనివాసరావు సెంట్రల్ వాటర్ కమిషన్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించడమే కాక వివిధ రాష్ట్రాల్లో విధులు నిర్వర్తించారు. మంగళగిరి సర్వతోముఖాభివృద్ధికి పెద్దల సలహాలు, సూచనలు అవసరమని, రాబోయే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం కాజలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాజ గ్రామానికి చెందిన వైసీపీ నేత పల్లా వెంకటేశ్వరరావు, ఆయనతోపాటు 65 వైసీపీ కుటుంబాలో లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరాయి. వీరికి లోకేశ్ పసుపు కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు.

అరాచక పాలన నుంచి రాష్ట్రానికి త్వరలో విముక్తి

- 1530వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు


వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, ఫిబ్రవరి 24: వైసీపీ అరాచక పాలన నుంచి రాష్ట్రానికి త్వరలో విముక్తి కలుగుతుందని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1530వ రోజుకు చేరుకున్నాయి. ఈ సంద్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ, ప్రజా రాజధాని అమరావతి గెలుస్తుందన్నారు. మూడు ముక్కలాటకి శాశ్వతంగా స్వస్తి చెబుదామని ఐదుకోట్ల మంది తెలుగు ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు. బాధల నుంచి విముక్తి కలగాలంటే విజన్ ఉన్న చంద్రబాబు నాయుడి లాంటి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ఎప్పటికైనా అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని అని స్పష్టం చేశారు. ఉన్నత న్యాయస్థానం తీర్పు కూడా ఇదే అంశాన్ని ధ్రువీకరించదన్నారు. న్యాయం ధర్మం భూములిచ్చిన తమ వైపు ఉందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో రైతు ఆందోళనలు కొనసాగాయి.

అక్రమ ఇసుక దందాపై చర్యలు తీసుకోవాలి

- టీడీపీ, జనసేన శ్రేణులు


అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకున్న టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు

కొల్లూరు, ఫిబ్రవరి 24: వైసీపీ నాయకులు చేస్తున్న ఇసుక దందా, అక్రమ తవ్వకాల మీద చర్యలు తీసుకోవాలని కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం కొల్లూరు మండలం పెదలంకలో ఉన్న కృష్ణానదిలో జరిగే అక్రమ ఇసుక తవ్వకాలను మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు మాజీమంత్రి నక్కా ఆనందబాబు ఆదేశాల మేరకు టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ఆయా పార్టీల నాయకులు ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ, మంత్రి నాగార్జున అవినీతి మత్తులో సంపాదనే ధ్యేయంగా ఇసుక అక్రమ తవ్వకాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మంత్రితో పాటు వైసీపీ నాయకులు భాగస్వామ్యం ఉండటం వల్ల అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. వేమూరు నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలించి ఇసుక మాఫియాపై వెంటనే తగుచర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన పార్టీల తరపున డిమాండ్ చేశారు. ఈ విషయంపై తహసీల్దార్, ఎస్ఐలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జనసేన వేమూరు నియోజకవర్గ సమన్వయ కర్త ఊసా రాజేష్, బాపట్ల పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబు, బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు తమ్మా శివారెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, బాపట్ల పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు మొవ్వా శరత్‌చంద్ర, మండల జనసేన అధ్యక్షులు చలమయ్య, నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంగళగిరిలో 180 కుటుంబాలు టీడీపీలో చేరిక

- కండువా కప్పి ఆహ్వానించిన నారా లోకేశ్


టీడీపీలో చేరిన కార్యకర్తలతో లోకేశ్

మంగళగిరి, ఫిబ్రవరి 24: మంగళగిరి నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతోంది. ఎన్నికల సమయానికి ఆ పార్టీలో ఎవరు వుంటారో.. ఎవరు వెళ్లిపోతారో తెలియని పరిస్థితి నెలకొంది. వైసీపీ మునిగిపోతున్న నావ అని గమనించిన పలువురు నేతలు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నారు. తాజాగా, నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 180 కుటుంబాలు శనివారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో పసుపు కండువా కప్పుకున్నాయి. ఉండవల్లిలోని నివాసంలో కొత్తగా పార్టీలో చేరిన వారికి కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ మంగళగిరి అభివృద్ధిని కాంక్షిస్తూ తమ వెంట వస్తున్న వారిని అభినందించారు. పార్టీలో కొత్తగా చేరిన వారిని ఇప్పటికే పనిచేస్తున్న నేతలు కలుపుకొని ముందుకు సాగాలని సూచించారు. తాడేపల్లి పట్టణానికి చెందిన పల్లెపోగు అరుణ్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, చింకా శ్రీనివాస్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, 11వ వార్డుకు చెందిన 30 కుటుంబాలు, మంగళగిరి పట్టణానికి చెందిన అవ్వారు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, చిర్రావూరుకు చెందిన రెడ్డి విజయ్, మేడూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మరో 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు దామర్లరాజు, తాడేపల్లి మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌ల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రికి నివేదించిన వివిధ జిల్లాల నాయకులు

గుంటూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ల్యాబ్ టెక్నీషియన్‌లను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని అసోసియేషన్ నాయకులు వాపోయారు. శనివారం సాయంత్రం కొరిటెపాడులోని ఎల్వీఆర్ క్లబ్‌లో డయాగ్నోకాన్-2024 సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్లు మాట్లాడుతూ ఉత్తర భారతదేశంలో ఎక్కడో ఒక కోర్టు తీర్పు ద్వారా ప్రతీ ల్యాబ్‌కు అర్హత పొందిన పెథాలజిస్టు ఉండాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ఇక్కడ అమలు చేస్తూ అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. దీని వలన గుంటూరు, కాకినాడ, ఏలూరు, వైజాగ్ వంటి జిల్లాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మంది రోడ్డున పడ్డారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పెథాలజిస్టుల ద్వారానే ల్యాబ్ రిపోర్టులు అందించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి రజని స్పందించి తాను ఈ విషయాన్ని సీఎం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇబ్బంది లేకుండా నిర్ణయం తీసుకొంటామని చెప్పారు. అలానే ల్యాబ్ టెక్నీషియన్‌లు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సదస్సులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి, కార్యదర్శి తాడికోరు శ్రీహరి, కృష్ణ, శర్మ, బాబ్జి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


మంత్రి రజనికి వినతిపత్రం అందజేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల సంఘాల నాయకులు



ప్రత్యేక హోదా కోసం ఉద్యమం ఉధృతం

- విభజన హామీల సాధన జేఏసీ పిలుపు

గుంటూరు, ఫిబ్రవరి 24: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అన్ని పార్టీలతో కలిపి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన విద్యార్థి, యువజన రాష్ట్ర జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. కొత్తపేట మల్లయ్యలింగం భవన్‌లో జేఏసీతో పాటు పలువురు నాయకులు మీడియాతో మాట్లాడారు. జేఏసీ కన్వీనర్ షేక్ జిలాని మాట్లాడుతూ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయకుంటే మార్చి ఒకటిన సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఢిల్లీ వేదికగా ఉద్యమాలు చేశామన్నారు. దీనికి ఏపీసీసీ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ ప్రత్యేక హోదా కోసం జేఏసీ చేసే ఉద్యమానికి సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఛలో సీఎం క్యాంపు కార్యాలయం పేరుతో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉడా మాజీ చైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డి, జేఏసీ నాయకులు అంగిరేకుల వరప్రసాద్‌యాదవ్, నూనె పవన్‌తేజ, కోట మాల్యాద్రి, శివారెడ్డి, నారదాసు వీరమణీంద్ర, చైతన్య, నరసింహారావు తదితరులున్నారు.

నేడు మంగళగిరి ఎయిమ్స్ జాతికి అంకితం

- వర్చువల్‌గా చేయనున్న ప్రధాని నరేంద్ర మోదీ

మంగళగిరి, ఫిబ్రవరి 24: దేశంలో కెల్లా అత్యుత్తమంగా రూపుదిద్దుకున్న మంగళగిరి ఎయిమ్స్ ఆదివారం జాతికి అంకితం కానున్నది. అత్యంత సువిశాలమైన ప్రాంతంలో పచ్చని కొండల నడుమ, ఆహ్లాదకరమైన గ్రీనరీ మధ్య సుందరంగా, విజయవాడ-గుంటూరు నగరాల నడమ, నవ్యరాజధాని అమరావతికి అత్యంత చేరువగా మంగళగిరి ఎయిమ్స్ అత్యద్భుతంగా ఆవిష్కృతమైంది. ఇన్నీ అనుకూలతలతో కూడిన ఎయిమ్స్ దేశంలో మరెక్కడా లేవన్నది కేంద్ర వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల మాట. కేంద్ర ప్రభుత్వం మంగళగిరిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో జాతికి అంకితం చేయనున్నారు. దీంతో పాటు 9 క్రిటికల్ కేర్ బ్లాకులకు శంకుస్థాపన చేయనున్నారు. ఎయిమ్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డైరెక్టర్ అండ్ సీఈవో డాక్టర్ మధుబానందకర్ మాట్లాడుతూ ఆదివారం జరగనున్న కార్యక్రమంలో గవర్నరు ఎస్.అబ్దుల్‌నజీర్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సూఖ్ మాండవ్య, కేంద్ర బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద జోషి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, గిరిజన వ్యవహారాల శాఖామంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ ఎవార్, కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి ప్రొఫెసర్ ఎస్పీ సింగ్ బఘేల్, ఏపీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని హాజరుకానున్నారని తెలిపారు.

51 మంది ఎస్ఐలకు నియామక పత్రాలు

గుంటూరు, ఫిబ్రవరి 24: గుంటూరు రేంజ్ పరిధిలో గత సంవత్సరంలో జరిగిన



పోలీసు నియామక ప్రక్రియలో ఎంపికైన 51 మంది ఎస్ఐ అభ్యర్థులకు శనివారం రేంజ్ ఐజీ పాలరాజు నియామక ఉత్తర్వులు అందజేశారు. అనంతరం వారందరినీ శిక్షణ నిమిత్తం అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కాలేజీకి ఎంపిక చేశారు. దీంతో వారు శనివారం సాయంత్రం గుంటూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి ప్రత్యేక బస్సుల్లో అనంతపురానికి బయలు దేరి వెళ్లారు.


నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00






ఎన్నికల బరిలో నిలిచేది ఎవరు.. ఎవరికి టిక్కెట్ ఇస్తారు.. వైసీపీ ఫేక్ ప్రచారం.. పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ.. తదితరాలన్నింటికీ తెరపడింది. ఎన్నికల బరిలో ఉండేదెవరో స్పష్టత వచ్చేసింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మూడు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని 14 అసెంబ్లీ స్థానాలకు శనివారం టీడీపీ, జనసేన అధినేతలు సంయుక్తంగా ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించారు. సిట్టింగ్‌లకు.. సీనియర్లకు.. సమర్థతకు.. విధేయతకు తొలిజాబితాలో పెద్ద పీట వేశారు. ప్రతి ఎన్నికల్లోనూ చివరి నిమిషాన పేరు ప్రకటించే సంప్రదాయానికి భిన్నంగా చంద్రబాబు ఈ సారి 52 రోజుల ముందే అభ్యర్థి ఎవరో తేల్చేయడం గమనార్హం. పొత్తు నేపథ్యంలో జనసేన ప్రకటించిన జాబితాలో తెనాలి ఉండగా ఇక్కడి నుంచి ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నాదెండ్ల మనోహర్‌కు అవకాశం దక్కింది. రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్ల ప్రకటనతో ఇరు పార్టీల శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. అభ్యర్థులకు అభినందనలు తెలుపుతూ, ప్రదర్శనలు నిర్వహిస్తూ బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఎన్నికల్లో సత్తా చూపి విజయభావుటా ఎగరవేసి అధినేతలకు గిఫ్ట్ అందజేస్తామని అభ్యర్థులు ప్రకటించారు.

ఉమ్మడిగా.. సై

- టీడీపీ, జనసేన తొలి జాబితా విడుదల
- పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు.. సంబరాలు
- తెనాలి నుంచి జనసేన అభ్యర్థిగా మనోహర్ పేరు ఖరారు
- గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 14 స్థానాల్లో అభ్యర్థుల ఖరారు
- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సీనియర్లకు మరో అవకాశం
- బాపట్ల జిల్లాలో మూడు చోట్ల సిట్టింగ్‌లకే తిరిగి అవకాశం
- బాపట్ల నుంచి వేగేశన, ప్రత్తిపాడు నుంచి రామాంజనేయులు తొలి సారి పోటీ




(గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, తెనాలి, ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం, జనసేన పార్టీల తరఫున శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితా విడుదలతో ఉత్కంఠకు తెరపడింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఆరుగురి మినహా మిగిలిన అన్ని స్థానాలకు అభ్యర్థులను ఒకేసారి ప్రకటించారు. దీంతో ఇరు పార్టీల శ్రేణులు ఆనందోత్సాహాలలో మునిగి తేలారు. అభ్యర్థులు సైతం ఇకపై మరింతగా ప్రజలతో మమేకమయ్యేందుకు కార్యాచరణకు సిద్ధమయ్యారు. జిల్లాలో వైసీపీ ఖాతా తెరవకుండా ఉండడమే లక్ష్యంగా తమ కార్యాచరణ ఉండనున్నదని అభ్యర్థులు ప్రకటించారు. తొలి జాబితాలో పల్నాడు జిల్లా పరిధిలోని నాలుగు స్థానాలకు, బాపట్ల జిల్లా పరిధిలోని చీరాల మినహా మిగిలిన ఐదు స్థానాలకు, గుంటూరు జిల్లా పరిధిలోని ఐదు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. వైసీపీలో అభ్యర్థుల ఎంపికపై గందరగోళం నెలకొనగా టీడీపీ ముందంజలో ఉంది. ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించి టీడీపీ, వైసీపీకి సవాల్ విసిరింది. తొలి జాబితాలో సీటు ఖరారైన వారిలో మాజీ మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనందబాబులు ఉన్నారు. బాపట్ల జిల్లాలో రేపల్లె, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లకే అవకాశం కల్పించారు. బాపట్ల నుంచి వేగేశన నరేంద్రవర్మ, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నుంచి విశ్రాంత ఐఏఎస్ బూర్ల రామాంజనేయులు తొలిసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పార్టీ అభ్యర్థుల ప్రకటనతో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీలతో పాటు బాణసంచా కాల్చి అనందోత్సాహాలను వ్యక్తం చేశాయి. అభ్యర్థులను నేతలు, కార్యకర్తలు కలిసి సత్కరించారు. నేతలకు శుభాకాంక్షలు చెప్పడానికి శ్రేణులు పార్టీ కార్యాలయాల్లో బారులు తీరారు. ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని అటు టీడీపీ, ఇటు జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రకటించారు.

నాలుగోసారి జీవీ





టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులుకు వినుకొండ నుంచి పోటీకి నాలుగో సారి అధిష్ఠానం అవకాశం ఇచ్చింది. ఆయన వినుకొండ నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో ఓటమి చెందిన జీవీ వరుసగా నాలుగోసారి వినుకొండ బరిలో దిగుతున్నారు. టీడీపీ ఆవిర్భావం అనంతరం జరిగిన ఎన్నికల్లో ఇక్కడ మూడు సార్లు పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. టీడీపీ పొత్తులో సీపీఐ రెండు సార్లు విజయం సాధించింది. మొదటి నుంచి టీడీపీకి వినుకొండ బలమైన నియోజకవర్గం.

సత్తెనపల్లి నుంచి కన్నా



సత్తెనపల్లి నుంచి మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పేరును పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. గతంలో నాలుగుసార్లు పెదకూరపాడు నుంచి, గుంటూరు పశ్చిమ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందిన కన్నా టీడీపీ అభ్యర్థిగా తొలి సారి సత్తెనపల్లి బరిలో దిగుతున్నారు. 1989లో మొట్టమొదటి సారిగా పెదకూరపాడు అసెంబ్లీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1994, 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత 2009లో గుంటూరు పశ్చిమ నుంచి విజయం సాధించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నేదురుమల్లి జనార్థనరెడ్డి, కోట్ల విజయ భాస్కరరెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి, కొణిజేటి రోశయ్య, ఎన్ కిరణ్ కుమార్‌రెడ్డిల మంత్రి వర్గాల్లో పలు మంత్రి పదవులు నిర్వహించారు. కాగా 2024 ఫిబ్రవరి 24న ఆయనను సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించారు.

పుల్లారావు ఆరోసారి



చిలకలూరిపేట నుంచి వరుసగా ఆరోసారి మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పోటీ చేస్తున్నారు. గతంలో ఐదు సార్లు పోటీ చేయగా మూడు సార్లు విజయం సాధించారు. 1983 నుంచి జరిగిన ఎన్నికల్లో 1983, 1989, 1999, 2009, 2014, ఎన్నికల్లో టీడీపీ ఇక్కడ విజయం సాధించింది.

బ్రహ్మారెడ్డి మూడోసారి..



మాచర్ల టీడీపీ అభ్యర్థిగా జూలకంటి బ్రహ్మారెడ్డి పేరును అధిష్ఠానం ప్రకటించింది. ఉన్నత విద్య చదివిన బ్రహ్మారెడ్డి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం ఇది మూడోసారి. వారి తల్లి దండ్రులు నాల్గుసార్లు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు. గతంలో 2004, 2009 ఎన్నికల్లో ఓటమి చెందారు. 1999లో బ్రహ్మారెడ్డి తల్లి దుర్గాంబ ఎమ్మెల్యేగా గెలుపొందారు. మాచర్లలో అరాచకాలను అడ్డుకుంటూ పార్టీ క్యాడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేశారు. 2021 డిసెంబరు 22న బ్రహ్మారెడ్డిని మాచర్ల ఇన్‌చార్జిగా చంద్రబాబు నియమించారు. దీంతో నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌లో ఉత్సాహం, ధైర్యం నెలకొంది. ఏదైనా జరిగితే బ్రహ్మారెడ్డి వస్తాడనే భావం ఆ పార్టీ నేతల్లో ఉంది.

పల్నాడు జిల్లా..

సత్తెనపల్లి	కన్నా లక్ష్మీనారాయణ
చిలకలూరిపేట	ప్రత్తిపాటి పుల్లారావు
వినుకొండ	జీవీ ఆంజనేయులు
మాచర్ల	జూలకంటి బ్రహ్మారెడ్డి



ఆనందబాబు నాలుగో సారి..



వేమూరు అభ్యర్థిగా బరిలో ఉండనున్న మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు రాజకీయాల్లో అంచలంచలుగా ఎదిగారు. కొల్లిపర మండలం సిరిపురంలో జన్మించిన ఆయన గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. తదుపరి బీఏ పూర్తి చేసి, ఆంధ్ర యూనివర్సిటీలో బీఎల్ పట్టా పొందారు. రాజకీయాలపై ఆసక్తితో 1987-88లలో గుంటూరు జిల్లా తెలుగు విద్యార్థి అధ్యక్షుడిగా ఐదేళ్ల తర్వాత ఆర్గనైజింగ్ సెక్రటరిగా, పార్టీ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. 2009లో తొలిసారి వేమూరు నుంచి గెలుపొందారు. 2014లో రెండోసారి విజయం సాధించి మంత్రిగా కూడా పనిచేశారు. 2019లో ఓటమి పాలయ్యారు. మరలా ఇప్పుడు టీడీపీ అభ్యర్థిగా వేమూరు నుంచి బరిలో దిగనున్నారు.

గొట్టిపాటి ఐదో సారి



అద్దంకి నుంచి వరుసగా నాలుగు పర్యాయాలు గెలుపొంది ఓటమెరుగని నేతగా గొట్టిపాటి రవికుమార్ కీర్తి గడించారు. ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న రవికుమార్‌కే మరో సారి టీడీపీ నుంచి పోటీ చేసే అవకాశం వచ్చింది. 2004లో మార్టూరు నుంచి కాంగ్రెస్ తరఫున గెలుపొందగా, 2009లో అద్దంకి నుంచి అదే పార్టీలో బరిలో ఉండి విజయం సాధించారు. 2014లో వైసీపీ తరఫున గెలిచి హ్యాట్రిక్ విజయం నమోదు చేశారు. 2019లో టీడీపీ తరఫున గెలుపొందారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న రవికుమార్ రాబోయే ఎన్నికలలో మరోమారు బరిలో నిలిచారు.

హ్యాట్రిక్‌పై ఏలూరి కన్ను



పర్చూరు ఎమ్మెల్యేగా 2014, 2019లో టీడీపీ తరఫున గెలుపొందిన ఏలూరి సాంబశివరావు 2024లో కూడా బరిలో ఉండనున్నారు. ఈ ఎన్నికల్లో కూడా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమయ్యారు. 2019లో ఎన్టీఆర్ అల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావుపై గెలుపు బావుటా ఎగురవేశారు. మార్టూరు మండలం కోనంకిలో జన్మించిన ఆయన హార్టికల్చర్ విభాగంలో మాస్టర్ డిగ్రీ పొందారు. అనంతరం అదే విభాగంలో ప్రభుత్వ ఉద్యోగిగా కూడా సేవలందించారు. ప్రస్తుతం పర్చూరు ఎమ్మెల్యేగా ఉండడంతో పాటు బాపట్ల లోక్‌సభ టీడీపీ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు.

హ్యాట్రిక్ లక్ష్యంలో అనగాని



రేపల్లె టీడీపీ అభ్యర్థిగా అనగాని సత్యప్రసాద్ నాలుగోసారి బరిలో ఉండనున్నారు. ఆయన బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశారు. 2009లో టీడీపీ తరఫున పోటీ చేసిన ఆయన మోపిదేవి చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత వరుసగా 2014, 2019లలో టీడీపీ తరఫున విజయం సాధించిన ఆయన ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలనే లక్ష్యంతో ఉన్నారు. రాజకీయంగా కుటుంబ నేపథ్యం ఉండడంతో పాటు నియోజకవర్గంలో సేవలందించడంలో తనదైన మార్కు చూపించారు. అంతేకాకుండా టీడీపీ అధినేతతో సన్నిహిత అనుబంధం ఉన్న అతి కొద్దిమందిలో అనగాని ఒక్కడిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

ఎన్నికల బరిలో వేగేశన



బాపట్ల టీడీపీ అభ్యర్థిగా ఖరారైన వేగేశన నరేంద్ర వర్మ.. వ్యాపార రంగంలో విజయం సాధించి వేగేశన ఫౌండేషన్ పేరిట సేవలందిస్తూ రాజకీయ రంగంలోకి అడుగుపెట్టారు. 2009 నుంచి టీడీపీలో క్రియాశీలకంగా ఉంటున్నప్పటికీ తొలిసారి ఆయన ఎమ్మెల్యే అభ్యర్థిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పార్టీకి విధేయుడన్న గుర్తింపే ఆయనకు బాపట్లలో పోటీచేసే అవకాశం వచ్చింది.

బాపట్ల జిల్లా

పర్చూరు	ఏలూరి సాంబశివరావు
బాపట్ల	వేగేశన నరేంద్రవర్మ
వేమూరు	నక్కా ఆనందబాబు
రేపల్లె	అనగాని సత్యప్రసాద్
అద్దంకి	గొట్టిపాటి రవికుమార్

రెండో సారి లోకేశ్..



మంగళగిరి నుంచి యువ నేత నారా లోకేశ్ రెండో పర్యాయం బరిలోకి దిగుతున్నారు. గత ఎన్నికల్లో ఆయన ఇక్కడి నుంచి పోటీ చేసి ఓటమి చెందినా నియోజకవర్గాన్ని వీడకుండా పార్టీ శ్రేణులకు అండగా ఉన్నారు. ఈ ఐదేళ్ళలో ప్రతిఒక్కరికీ ఏదో ఒక రూపంలో ఆయన సాయమందిస్తూ వచ్చారు. లాంఛనంగా ఆయన పేరు తాజాగా ప్రకటించినప్పటికీ ఎప్పటి నుంచో ఆయన తన విజయానికి బాటలు వేసుకుంటూ వస్తున్నారు. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డికి గ్రూపు విబేదాలు మూలంగా గెలుపు అవకాశాల్లేవని, ఆయన్ని తప్పించి గంజి చిరంజీవిని బరిలోకి దించిన విషయం తెలిసిందే. దీంతో ఆళ్ల వైసీపీకి రాజీనామా చేశారు. అయితే ఇక్కడ ఎవరికి టిక్కెట్ ఇచ్చినా ఆళ్ల వ్యతిరేకంగా చేస్తే గెలుపు అసాధ్యమని భావించిన వైసీపీ అధిష్ఠానం తిరిగి ఆయన్ను బుజ్జగించి పార్టీలోకి చేర్చుకున్నది.

ఏడో సారి నరేంద్ర



పొన్నూరు నుంచి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు మారో పేరును ప్రకటించారు. అదే నియోజకవర్గం నుంచి ఆయన ఏడో పర్యాయం ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ గాలిలో స్వల్ప మెజార్టీతో ఆయన ఓటమి పాలై డబుల్ హ్యాట్రిక్‌ను మిస్ అయ్యారు. ఈ ఐదేళ్ల ఆయన ప్రభుత్వంపై పార్టీ పరంగా పోరాటం చేయటమే కాకుండా వ్యక్తిగతంగా కూడా తాడేపల్లి ప్యాలెస్‌ను ఢీ కొనాల్సి వచ్చింది. దీంతో వ్యక్తిగతంగా కక్ష కట్టి సంగం డెయిరీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఆయన్ను అకారణంగా జైలు పాలు కూడా చేశారు. న్యాయ పోరాటం ద్వారా వైసీపీ ప్రభుత్వాన్ని ఢీ కొనటమే కాకుండా డెయిరీ వారి బారిన పడకుండా నరేంద్ర కాపాడుకున్నారు.

ప్రత్తిపాడు నుంచి విశ్రాంత ఐఏఎస్



ఎస్సీ నియోజకవర్గమైన ప్రత్తి పాడు నుంచి విశ్రాంత ఐఏఎస్ బూర్ల రామాంజనేయులు పేరును ప్రకటించారు. ఇప్పటికే ఆయన నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్నారు. గతంలో ఇక్కడి నుంచి పోటీ చేసి పరాజయం చెందిన స్థానికుడైన కందుకూరి వీరయ్యకు ఈ పర్యాయం సీటు ఇవ్వాలని జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నేతలు ప్రయత్నించినా చంద్రబాబు రామాంజనేయులు వైపే మొగ్గారు. కొన్నేళ్ళుగా రాష్ట్ర కార్యాలయంలో ఉండి ఐటీ వింగ్ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న రామాంజనేయులుకు అది ప్లస్ పాయింట్‌గా మారింది. కొందరు ఐఏఎస్‌లకు అవకాశం కల్పించాలన్న చంద్రబాబు నిర్ణయంతో రామాంజనేయులు పేరు ఖరారైంది. ఈయన గతంలో గుంటూరు కలెక్టర్‌గా పనిచేశారు.



గుంటూరు జిల్లా

మంగళగిరి	నారా లోకేశ్
తాడికొండ	తెనాలి శ్రావణ్‌కుమార్
ప్రత్తిపాడు	బూర్ల రామాంజనేయులు
పొన్నూరు	ధూళిపాళ్ల నరేంద్ర
తెనాలి	నాదెండ్ల మనోహర్

నాలుగో సారి శ్రావణ్‌కుమార్



ఎస్సీ నియోజకవర్గమైన తాడికొండ నుంచి మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ నాలుగో సారి రంగంలోకి దిగుతున్నారు. ప్రస్తుతం ఆయన కొత్తగా ఏర్పడిన గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. 2009లో మొదటిసారి ఎన్నికల బరిలోకి దిగిన శ్రావణ్‌కుమార్ డొక్కా మాణిక్యవరప్రసాద్ చేతిలో ఓటమి చెందారు. తిరిగి 2014లో అదే నియోజకవర్గం నుంచి బరిలోకి దిగి విజయం సాధించారు. తుళ్ళూరు ప్రాంతాన్ని రాజధానిగా ప్రకటించటంతో ఆయన రాజధాని ప్రాంత ఎమ్మెల్యేగా కీలక పాత్ర పోషించారు. తిరిగి 2019లో బరిలోకి దిగి ఓటమి పాలయ్యారు. అయినా ఆయన నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులకు అండగా నిలవడమే కాకుండా అమరావతి రైతుల ఉద్యమానికి అండగా నిలిచారు.

ఐదో సారి నాదెండ్ల



మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు తనయుడైన నాదెండ్ల మనోహర్ జనసేన కోటాలో తెనాలి సీటును దక్కించుకున్నారు. గతంలో మూడు పర్యాయాలు కాంగ్రెస్ తరఫున ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మనోహర్ 2004, 2009లో వరుస విజయాలు చవిచూశారు. స్పీకర్‌గా కూడా పనిచేసే అవకాశం దక్కింది. ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున 2014 లో బరిలోకి దిగి పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత జనసేనలో చేరి 2019 ఎన్నికల్లో ఓడిపోయారు. ప్రస్తుతం ఆ పార్టీ రాజకీయాల వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా కీలకపాత్ర వహిస్తున్నారు. అయితే 2019 ఎన్నికల్లో ఓడిపోయినా నియోజకవర్గాన్నే అంటిపెట్టుకుని ప్రభుత్వంపై అలుపెరగని పోరాటం చేస్తూ జనసేనతో పొత్తును స్వాగతించిన ఆలపాటికి ఈసారి నిరాశ ఎదురైంది.

జంగా సీటుతో యరపతినేనికి లింకు





గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేరు మొదటి జాబితాలోనే తప్పనిసరిగా ఉంటుందని ఆయన అభిమానులు భావించారు. వైసీపీ ప్రభుత్వంపై పోరాటం చేస్తూ పార్టీ శ్రేణులకు అండగా నిలిచిన యరపతినేనికి సీటు ఖాయమే అయినప్పటికీ కొన్ని కారణాల దృష్ట్యా అధికారికంగా ప్రకటించలేదు. నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా అనీల్ కుమార్ వలస రావడంతో సామాజిక సమీకరణల సమస్య టీడీపీకి ఎదురైంది. నరసరావుపేట పార్లమెంటు పరిధిలో ఏదో ఒక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీసీ అభ్యర్థిని బరిలోకి దించాలని చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్న ఎమ్మెల్సీ జంగాకి తమ పార్టీ తరఫున బరిలోకి దించాలని టీడీపీ ఆలోచన. గతంలో రెండు సార్లు విజయం సాధించిన గురజాలనే ఆయన కోరుకోగా ఇచ్చే అవకాశం లేనందున జంగాకు ప్రత్యామ్నాయం చూసిన తర్వాతే యరపతినేని పేరు ప్రకటించాలని అధిష్ఠానం యోచన చేస్తున్నట్లు సమాచారం.

పెదకూరపాడుపై కసరత్తు

పల్నాడు, గుంటూరు లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ పెండింగ్ స్థానాలపై టీడీపీ కసరత్తు చేస్తోంది. పెదకూరపాడు ఇన్‌చార్జిగా డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ ఉన్నారు. గత ఎన్నికల్లో పరాజయం పాలైనా నియోజకవర్గాన్ని వీడకుండా పార్టీ శ్రేణులకు ఆయన అన్ని విధాలుగా అండగా ఉన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ వీడిన ముఖ్య నేతలు తిరిగి శ్రీధర్ పక్కన చేరి ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నారు. బయట వారిని తీసుకురావటానికి వీల్లేదని నేతలు, శ్రేణులు ఇటీవల గుంటూరులో సమావేశమై డిమాండ్ చేశారు.

టీఎస్ ఈఏపీసెట్ నోటిఫికేషన్

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్‌ఈ)- స్టేట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ ఈఏపీసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షను హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయుహెచ్) నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

కోర్సులు

- బీఈ, బీటెక్; బీటెక్(బయోటెక్నాలజీ/డెయిరీ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ); బీఫార్మసీ; బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/హార్టికల్చర్); బీఎస్సీ ఫారెస్ట్రీ; బీవీఎస్సీ అండ్ ఏహెచ్; బీఎఫ్ఎస్సీ
- ఫార్మా-డీ(డాక్టర్ ఆఫ్ ఫార్మసీ)
- బీఎస్సీ నర్సింగ్

అర్హత: అభ్యర్థులు చేరదలచుకున్న కోర్సును అనుసరించి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/బయాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.



టీఎస్ ఈఏపీసెట్ 2024 వివరాలు

- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. మొత్తం 160 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు నిర్దేశించారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.
- ఇంజనీరింగ్(ఇ) స్ట్రీమ్ అభ్యర్థులకు మేథమెటిక్స్ నుంచి 80 ప్రశ్నలు; ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలు ఇస్తారు.
- అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ(ఏపీ) స్ట్రీమ్ అభ్యర్థులకు బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలు ఇస్తారు.
- **దరఖాస్తు ప్రక్రియ:** ఫిబ్రవరి 26 నుంచి
- **ఏదేని ఒక స్ట్రీమ్‌నకు దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.900; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **రెండు స్ట్రీమ్‌లకు దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ1800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 6
- **టీఎస్ ఈఏపీసెట్ 2024 తేదీలు:** ఇంజనీరింగ్(ఇ) స్ట్రీమ్‌కు మే 9, 10; అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ(ఏపీ) స్ట్రీమ్‌కు మే 11, 12
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్(నాలుగు జోన్‌లు), నల్లగొండ, కోదాడ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్ నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు.
- **వెబ్‌సైట్:** eapcet.tsche.ac.in

దిక్సూచి

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PWo1UkFలో చదవండి.

హాలియాలో విశ్వంభర చిత్రీకరణ





వశిష్ఠ దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' సినిమా షూటింగ్ శనివారం నల్లగొండ జిల్లా హాలియాలోని వజ్రతేజ రైస్ ఇండస్ట్రీలో జరిగింది. పలు సన్నివేశాలు చిత్రీకరించారు. చిరంజీవితో పాటు నటులు రాజారవీంద్ర, హర్షవర్ధన్, వెన్నెల కిశోర్, చమ్మక్ చంద్ర, ప్రవీణ్, రోహన్, అకుల్, కుసుం చిత్రీకరణలో పాల్గొన్నారు. హాస్యనటులు, చిరంజీవికి మధ్య పలు సన్నివేశాలను చిత్రీకరించారు. వజ్రతేజ రైస్‌మిల్‌లో విశ్వంభర షూటింగ్ గురించి తెలుసుకున్న చిరంజీవి అభిమానులు, స్థానికులు ఉదయం నుంచే రైస్‌మిల్ వద్దకు భారీగా తరలివచ్చారు. హాలియా సీఐ రాఘవరావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి షూటింగ్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు.

మే 9నే కల్కి రాక

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మే 9న ఈ చిత్రం విడుదల కానుంది. అయితే ఈ సినిమా విడుదల వాయిదా పడనుందంటూ డిజిటల్ మీడియాలో వస్తున్న వదంతులపై నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ స్పందించింది. ముందు ప్రకటించినట్లు మే 9న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు స్పష్టం చేశారు. నేపథ్యంలో వినిపిస్తున్న



సంగీతానికి అనుగుణంగా ప్రభాస్ పాదం కదుపుతున్న వీడియోను శనివారం మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనే నటిస్తున్నారు. కమల్‌హాసన్ ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు.



భిన్నమైన పాత్రల్లో భీమా

గోపీచంద్ కథానాయకుడిగా ఏ. హర్ష దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్టైనర్ 'భీమా'. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలు. కేకే రాధామోహన్ నిర్మించారు. మార్చి 8న విడుదలవుతోంది. శనివారం



చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. గోపీచంద్ రెండు విభిన్నమైన పాత్రల్లో ఆకట్టుకున్నారు. ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు హర్ష కథను అద్భుతంగా తెరపైకి తెచ్చాడు. రవి బస్రూర్ బ్యాగ్రౌండ్ స్కోర్ ఇరగదీశాడు. ప్రేక్షకులు ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు. యాక్షన్‌తో పాటు కామెడీ, ఎంటర్టైన్‌మెంట్ చాలా గొప్పగా ఉంటుందని హర్ష తెలిపారు.



శనివారం సూర్య వేట

నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 29న విడుదలవుతోంది. శనివారం నాని పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. సూర్య అనే పాత్రలో నాని స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ఆయన పాత్రను మలచిన తీరు సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక.

సుజీత్ దర్శకత్వంలో

అలాగే నాని నటించే తదుపరి చిత్రాన్ని పుట్టిన రోజు సందర్భంగా ప్రకటించారు. 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. డీవీవీ దానయ్య నిర్మాత. 2025లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇతర వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

బహుముఖం ఉత్కంఠభరితం

హర్షివ్ కార్తిక్ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'బహుముఖం'. ఈ చిత్రం టీజర్‌ను శనివారం దర్శకుడు శశి కిరణ్ తిక్క చేతుల మీదుగా విడుదల చేశారు. 'టీజర్ బాగుంది. విజువల్స్‌తో పాటు సౌండ్‌కి చాలా ప్రాధాన్యత ఇచ్చారు. శ్రీచరణ్ బీజీఎం అదరగొట్టారు' అని ఆయన చిత్రబృందాన్ని ప్రశంసించారు. ఊహించని మలుపులతో కథ ఉత్కంఠభరితంగా సాగుతుందని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. చాలా ప్రేమతో, కష్టంతో చేసిన సినిమా ఇది, ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉందని హర్షివ్ కార్తిక్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఫణి కల్యాణ్. బ్యాగ్రౌండ్ స్కోర్: శ్రీచరణ్ పాకాల. సినిమాటోగ్రఫీ: ల్యూక్ ఫ్లెచర్











బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె





వంకాయలపాడులో బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ అనంతరం జరిగిన సభలో మాట్లాడుతున్న దగ్గుమళ్ల ప్రసాదరావు

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి

● దగ్గుమళ్ల ప్రసాదరావు

వంకాయలపాడు(ఇంకొల్లు),ఫిబ్రవరి 24: రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలంలోని వంకాయలపాడు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి దేవతోటి సుందరయ్య అధ్యక్షతన జరిగిన సభలో ప్రసాదరావు మాట్లాడారు. బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ అని అన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌జె.విద్యాసాగర్, దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు నూకతోటి బాబురావు, దేవతోటి నాగార్జున,రాజశేఖర్, డాక్టరు ఐ.బాబురావు, వంకాయలపాటి అంబేడ్కర్ యూత్, పర్చూరు, యద్దనపూడి మండలాల ఎస్సీ అధ్యక్షులు గిరి,కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు జాతి ఆరాధ్య దైవం ఎన్టీఆర్

చినగంజాం, ఫిబ్రవరి 24 : తెలుగు జాతి ఆరాధ్య దైవం నందమూరి తారకరామారావు అని, సూర్యచంద్రులు ఉన్నంత కాలం ఎన్టీఆర్ పేరు నిలిచి ఉంటుందని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని సంతరావూరు గ్రామంలో ముద్దన శివరామకృష్ణ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని శనివారం రాత్రి ఆయన టీడీపీ నేతలతో కలిసి ఆవిష్కరించారు. టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేవరపల్లి రాజేష్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ పార్టీ పెట్టిన తొమ్మిది మాసాలలోనే అధికారంలోనికి వచ్చి చరిత్ర సృష్టించిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. ఆయన వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబునాయుడు బాటలు వేశారన్నారు. టీడీపీతోనే రాష్ట్రం ప్రగతి బాటలు పడుతుందని అన్నారు. రాష్ట్రంలో నిరంకుశ రాజకీయం సాగిస్తున్న జగన్‌మోహన్ రెడ్డికి బుద్ధి చెప్పాల్సిన గడువు దగ్గరికి వచ్చిందని మాజీ మంత్రి ఆనందబాబు అన్నారు. రాష్ట్రంలో అవినీతి, దోపిడి రాజ్యమేలుతుందని, ఐదేళ్లుగా ప్రజలకు శాంతి లేదన్నారు. ముందుగా ఎమ్మెల్యే ఏలూరి గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల, చీరాల, సంతనూతలపాడు టీడీపీ ఇన్‌చార్జులు వేగేసన నరేంద్రవర్మ, ఎం.ఎం.కొండయ్య, బీఎన్.విజయ్‌కుమార్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలగల రాజశేఖర్‌బాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవతోటి సుందరయ్య, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు దేవతోటి నాగరాజు, తాతా జయప్రకాష్‌నారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బేతపూడి సురేష్, టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, మాజీ జెడ్పీటీసీలు యార్లగడ్డ లక్ష్మీ, మారెళ్ళ వెంకటరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జరుబుల సంధ్యారాణి, మండల పరిధిలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ చేస్తున్న టీడీపీ నేతలు

నూతన ఓటర్లు తెలుగుదేశం వైపు ఆసక్తి : సరోజనీ

బాపట్ల, ఫిబ్రవరి 24 : నూతనంగా ఓటు హక్కు పొందిన యువత తెలుగుదేశం వైపు ఆసక్తి చూపుతున్నారని ఆ పార్టీ బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ అన్నారు. మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని పట్టణంలోని 30వ వార్డు 71వ బూత్‌లో శనివారం నిర్వహించారు. ఓటర్ల వద్దకెళ్ళి వారి పేర్లను యాప్‌లో నమోదు చేశారు. ఓటు రాని వారిని దరఖాస్తు చేయించారు. కార్యక్రమంలో పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు, టీడీపీ నాయకులు కూచిపూడి ఝాన్సీరాణి, కూచిపూడి శ్యామ్ సుందర్, షేక్ నజ్మా, దగ్గుమల్లి రాణి, పల్లంజీవన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన కాపు యువత

బాపట్ల, ఫిబ్రవరి 24 : తెలుగు యువత ఆధ్వర్యంలో కాపుసామాజిక వర్గానికి చెందిన 70 మంది యువకులు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. తెలుగు యువత అధ్యక్షుడు ఉమ్మారెడ్డి వెంకటేష్‌నాయుడు ఆధ్వర్యంలో కాపుయువతకు నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యమని, పెద్ద ఎత్తున టీడీపీ వైపు ప్రజానీకం మొగ్గుచూపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీనాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గ్రూప్-2 స్ర్కీనింగ్ పరీక్షకు పటిష్ఠ బందోబస్తు

● పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ ● ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, ఫిబ్రవరి 24 : జిల్లాలో గ్రూప్-2 స్ర్కీనింగ్ టెస్ట్ పరీక్షకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ విషయమై శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో జరగనున్న గ్రూప్-2 స్ర్కీనింగ్ టెస్ట్ నిర్వహించే పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలలో 7671 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. దానికి అనుగుణంగా పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ముగ్గురు డీఎస్పీలు, 12 మంది సీఐలు, 25 మంది ఎస్సైలు, 224 మంది పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించనున్నారన్నారు.



వివరాలు తెలియజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

రైతువ్యతిరేక విధానాలు ముక్తకంఠంతో ఖండించాలి : సీపీఐ

బాపట్ల, ఫిబ్రవరి 24 : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ముక్తకంఠంతో ఖండించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ పిలుపునిచ్చారు. ఢిల్లీ, పంజాబ్, హర్యానా రాష్ట్రాల సరిహద్దులలో కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ సంయుక్త కిషాన్‌మోర్చా చేస్తున్న ఉద్యమానికి, పోరాటానికి మద్దతు తెలియజేస్తూ శనివారం బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో ప్రభుత్వ విధానాలను నిరసించారు. శుభంకిరణ్ అనే యువ రైతు మరణానికి నివాళులు అర్పించారు. కేంద్రప్రభుత్వం ఎటువంటి బేషజాలకు పోకుండా రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన జిల్లా నాయకులు గుదే రాజారావు, కొచ్చెర వినయరాజు, వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పి.కోటయ్య, సీపీఐ జిల్లా నాయకులు జెబి.శ్రీధర్, మామిడిబత్తుల గనీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భద్రావతీ సమేత భావనారుషి కల్యాణం

భట్టిప్రోలు, ఫిబ్రవరి 24 : భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లి శ్రీ సీతారామ మందిరంలో పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి శ్రీ భద్రావతీ సమేత భావనారుషిస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని, లోక కల్యాణార్థం శ్రీ భావనారుషి స్వామికి, సూర్యభగవానుని ప్రథమ పుత్రికారత్నమైన శ్రీ భద్రావతీ అమ్మవారికి మాఘ పౌర్ణమి రోజున కల్యాణాన్ని జరిపించడం జరుగుతుందని పద్మశాలీయ సంఘీయులు తెలిపారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ స్వామివార్ల కల్యాణాన్ని కొర్నిపాటి శ్రీనివాసరావు - రమాదేవి దంపతులచే వేద బ్రాహ్మణులు శాస్త్రయుక్తంగా జరిపించారు. ఆదివారం అద్దేపల్లిలోని రామమందిరం వద్ద అన్న సమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

వేగేశన పేరు ఖరారుపై నేతల్లో సందడి

● పెద్ద ఎత్తున సన్మానాలు, అభినందనలు

బాపట్ల, ఫిబ్రవరి 24 : బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా వేగేశన నరేంద్రవర్మను అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించటంతో శనివారం టీడీపీ కార్యాలయంలో సందడి నెలకొంది. నరేంద్రవర్మకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించి సన్మానించారు. పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఆయనకు అభినందనలు తెలిపి విజయానికి సైనికులవలే పని చేస్తామని చెప్పారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆయన చేపట్టిన ప్రతి కార్యక్రమం విజయవంతం కావటంతోపాటు విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన నరేంద్రవర్మకు ఎమ్మెల్యే టిక్కెట్టు ఇవ్వటం ముదావహమని పలువురు అన్నారు. నరేంద్రవర్మకు అభినందనలు తెలియజేసిన వారిలో రాష్ట్రనాయకులు తాతా జయప్రకాష్ నారాయణ, సలగల రాజశేఖర్, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల శివ, నియోజకవర్గ గౌరవాధ్యక్షులు తోట నారాయణ, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శులు తానికొండ దయాబాబు, పల్లం సరోజనీ, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కావూరి శ్రీనివాసరెడ్డి, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, మహిళ నాయకులు కూచిపూడి ఝాన్సీరాణి, షేక్. నజ్మా, దగ్గుమల్లి రాణి, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, సీనియర్ నాయకులు మందపాటి ఆంద్రేయ, బడుగు నాగేశ్వరరావు, కూచిపూడి శ్యామ్ సుందర్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, వెంకట్రావు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, తదితరులు ఉన్నారు.



నరేంద్రవర్మను సన్మానించి అభినందనలు తెలుపుతున్న తెలుగుమహిళలు



నరేంద్రవర్మను అభినందిస్తున్న టీడీపీ రాష్ట్రనాయకులు రాజశేఖర్, జయప్రకాష్ నారాయణ

● పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 24 : వేగేశన నరేంద్రవర్మను బాపట్ల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ఖరారు చేయటంపై శనివారం పిట్టలవానిపాలెం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు, వేగేశన నరేంద్రవర్మ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షులు ఎండి అఫ్జల్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, సీనియర్ టీడీపీనాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు కనుమూరి సాంబమూర్తిరాజు, మోదుగుల శంకరరెడ్డి, జాలాది లోకరాజ్యుడు, మాజీ ఎంపీపీ బొలగాని వెంకటసులోచన నారాయణ, బాపట్ల నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కలకోట కిషోర్ రెడ్డి, చటర్జీ, ఖాజీపాలెం మాజీ సర్పంచ్ మంతెన శ్రీదేవి కృష్ణమూర్తి రాజు, యువనాయకులు కొత్తపల్లి పృథ్వీరాజు, చందోలు టీడీపీ యువ నాయకులు సయ్యద్ నిజాం, బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్‌ఖాసీం, ప్రధాన కార్యదర్శి సయ్యద్ జునేద్, డేవిడ్, దండు శ్రీనివాసరాజు, నిజాంపట్నం నాగరాజు, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు గోకరాజు శ్రీధర్‌వర్మ, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలు భారీగా బాణా సంచాకాల్చి ఆనందోత్సవాల మధ్య సీట్లు పంచుకున్నారు.

భావ కవితా వైతాళికుడు కృష్ణశాస్త్రి

● సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ

బాపట్లటౌన్,ఫిబ్రవరి 24 : భావ కవిత్వాన్ని సమకాలిక కవులు ఎంతగానో విమర్శించిన 'నవ్వివోదురుగాక నాకేటి సిగ్గు నా యిచ్చయేగాక నాకేటి వెరపు' అంటూ భావ కవిత్వ ప్రాచుర్యానికి దేవులపల్లి వెంకటకృష్ణశాస్త్రి ఎంతగానో కృషి చేశారని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. శనివావారం దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి 44వ వర్ధంతి కార్యక్రమంలో సాహితిభారతి కోశాధికారి ఆదంషఫి, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు సంయుక్తంగా మాట్లాడుతూ కృష్ణశాస్త్రి ఊర్వశి, కృష్ణపక్షం వంటి కావ్యాలు రచించారని, వారి రచనలో లాలిత్యం, సహజత్వం, సరళత్వం, ప్రకృతిలో మమేకత్వం చాలా సుందరంగా ఉంటాయని అన్నారు. అనంతరం రావూరి నరసింహవర్మ, ఆదంషఫి, ఎం.మాల్యాద్రిరావు, కస్తూరి శ్రీనివాసరావు, ఎన్.కృష్ణ, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి తదితరులు దేవులపల్లి కృష్ణశాస్త్రి పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

బాపట్ల డీఎస్పీగా మురళీకృష్ణ

బాపట్ల, ఫిబ్రవరి 24 : బాపట్ల డీఎస్పీగా సీహెచ్ మురళీకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి అనంతరం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ టి.వెంకటేశులును 10 నెలలు గడవకముందే ఇక్కడ నుంచి బదిలీ చేసి ఆయన స్థానంలో మురళీకృష్ణను నియమించారు.

ఘనంగా శ్రీపోలేరమ్మతల్లి దేవాలయ వార్షికోత్సవం

బాపట్ల,ఫిబ్రవరి 24 : పట్టణంలోని నాల్గవ వార్డు రైలుపేట భావరాజుతోటలో ఉన్న శ్రీపోలేరమ్మతల్లి దేవాలయ ప్రథమ వార్షిక వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, పొంగళ్ళు పొంగించి మొక్కుబడులు చెల్లించారు. అనంతరం అన్నసంతర్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పాల జ్ఞానయ్య, పోలేరమ్మతల్లి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా అనఘదేవి వ్రతపూజలు

బాపట్ల, ఫిబ్రవరి 24 : మహర్షి ఆశ్రమగోశాలలో శనివారం గణపతి సచ్చితానందస్వామి శిష్యం బృందంచే అనఘదేవి వ్రతపూజ కార్యక్రమం బాబునాగేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం గోపూజ అనంతరం వ్రతపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాబునాగేంద్ర, కేతినేని తిరుపతయ్య, అంజనేయశర్మ, అశోకసువర్చల దంపతులు, శ్రీనివాసజ్యోతిర్మయి దంపతులు, యామిని, ప్రసన్నాదేవి, రమాదేవి దంపతులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

కర్లపాలెం, ఫిబ్రవరి 24 : డ్వాక్రా గ్రూపు మహిళలందరూ జీవనోపాధులపై అవగాహన కలిగి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని బాపట్ల క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ ఉసురుపాటి సుబారావు అన్నారు. మండలంలోని మహిళా సమైక్య కార్యాలయంలో మండల సమైక్య సెక్రటరి డి.నాగలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం మండల మహిళ సమైక్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బారావు మాట్లాడుతూ గోదావరి జిల్లా నుంచి 18 పాడిగేదెలను కొనుగోలు చేసుకొని రావటం జరిగిందని, వారందరికి కూడా లోన్స్ కూడా మండల సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ఏపీఎం ఎన్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మహిళా సంఘాలతో గ్రామ జలసంఘాల ద్వారా ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటు చేసే బాధ్యతను ప్రభుత్వం మహిళలకు అప్పజెప్పటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య ఉపాధ్యక్షురాలు శివలీల, సీసీలు ఎస్.పూర్ణచంద్రరావు, కె.శివకోటేశ్వరరావు, అకౌంటెంట్ ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

ప్రింటర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

బాపట్ల, ఫిబ్రవరి 24 : బాపట్ల ప్రింటర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే కోన రఘుపతికి అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ముద్రణయంత్ర సృష్టికర్త జోహాన్స్‌గూటెన్‌బర్గ్ జయంతి సందర్భంగా ప్రింటర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీభావన్నారాయణస్వామి దేవాలయం రోడ్డులో ప్రింటింగ్ యాజమానులు, కార్మికులు గూటెన్‌బర్గ్ పటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే కోన రఘుపతికి వినతిపత్రం అందజేసి మూడు దశాబ్దాలుగా తాము రోడ్లపైనే వేడుకలు జరుపుకుంటున్నామని, కమ్యూనిటీ హాలుకు స్థలం కేటాయించాలన్నారు. తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, తాపీ వర్కర్స్ మాజీ సెక్రటరీ మస్తాన్‌వలి, కార్యదర్శి నల్లమోతు దయాశీలం, కోశాధికారి జల్లూరి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరి సుబ్బరామయ్య, ఉపాధ్యక్షులు ఫణిరాజశయన్, సభ్యులు ఆర్కే గోపాల్, శ్రీనివాసరావు, రాము, చిన్ని, సాంబయ్య, ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తలనే టీడీపీ కార్యకర్తలుగా చిత్రీకరణ

అమృతలూరు, ఫిబ్రవరి 24 : తమ సొంత పార్టీ కార్యకర్తలను టీడీపీ కార్యకర్తలుగా చిత్రీకరించడం వైసీపీ నాయకులకే చెల్లిందని తెలుగుదేశం పార్టీ నాయకులు ఎద్దేవా చేశారు. శనివారం స్థానిక మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు యలవర్తి బ్రహ్మానందం విలేకర్లతో మాట్లాడుతూ, అమృతలూరుకు చెందిన కొంత మంది ముస్లింలు తెలుగుదేశం పార్టీ నుంచి వైసీపీలో ఆ పార్టీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సమక్షంలో చేరారని ఆ పార్టీ నాయకులు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సొంత పార్టీ కార్యకర్తలకే కండువాలు కప్పి వారు తెలుగుదేశం పార్టీ నుంచి వైసీపీలో చేరారని చెప్పడం వారి రాజకీయ కుటిల బుద్ధికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కె.రవీంద్రబాబు, కొసరాజు దేవకుమార్, పి.వెంకటసుబ్బారావు, కొత్తపల్లి మాథ్యూస్, మనోహర్, అజయ్ పాల్గొన్నారు.

ఇచ్చిన మాట తప్పినందుకా సిద్ధం : జనసేన

రేపల్లె, ఫిబ్రవరి 24 : సంపూర్ణ మద్యపానం అంటే ప్రభుత్వమే మద్యం అమ్మించటమేనా, ఇచ్చిన మాట తప్పినందుకు సిద్ధమా అంటూ జనసేన పార్టీ పట్టణాధ్యక్షుడు రాసంశెట్టి మహేష్ ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పినందుకు శనివారం ఇసుకపల్లిలోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద టీడీపీ, జనసేన నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు మేము అధికారంలోకి వస్తే పూర్తిగా మద్యపానం నిషేధం చేస్తామంటూ వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చి ఐదేళ్ళలో మద్యపాన నిషేధం చేయకుండా మాట తప్పి మడం తిప్పారన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు గోగినేని పట్టాభిరామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం ద్వారా జగన్ అండ్ కో లక్షలాది కోట్ల రూపాయలు దోచుకుతిన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దున్నా జయప్రద, యలవర్తి లక్ష్మీ, మోర్ల అరుణ, పందరబోయిన గోపి, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, తాడిపర్తి మల్లికార్జున్‌రావు, పంతాని నరేష్, పందరబోయిన గోపి, జనసేన నాయకులు దేవగిరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చేసే నాయకుడికే తొలి ఓటు వేయాలి : శరత్‌చంద్ర

రేపల్లె, ఫిబ్రవరి 24 : రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండిన యువత ఓట్లు నమోదు చేసుకోవాలని బాపట్ల పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మొవ్వ శరత్‌చంద్ర అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యువత 48 లక్షల కొత్త ఓట్లు నమోదు అయ్యాయని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే టీడీపీ, జనసేన సంయుక్త కూటమికి తొలిఓటు వేసి మీ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. టీడీపీ, జనసేన ఉమ్మడి కూటమి గెలిశాక యువతకు 20 లక్షల ఉద్యోగాల రూపకల్పన సిద్ధం చేశామన్నారు. టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, ప్రొఫెషనల్ కన్వీనర్ బురిందపల్లి రామారావు, కొసరాజు పృథ్వీ, యరగళ్ళ ధర్మతేజ, వీరంకి సుధీర్, బొర్రా సూర్యరాజు, యలవర్తి లక్ష్మీ, పి.లక్ష్మీనరసింహ, పద్యల సాయితేజ పాల్గొన్నారు.

నియోజకవర్గంలో 307 డబుల్ ఎంట్రీలు

రేపల్లె, ఫిబ్రవరి 24 : నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు ఉన్నాయంటూ స్థానిక టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసినా బీఎల్‌వోలు స్పందించటం లేదంటూ ఆరోపిస్తున్నారు. నియోజకవర్గంలో డబుల్ ఎంట్రీలు 307 ఉన్నాయని, జీరో డోర్‌నెంబరుతో 38 ఓట్లు ఉన్నాయన్నారు. అవేకాకుండా చనిపోయిన వారి ఓట్లను కొన్ని ప్రాంతాల్లో తొలగించలేదని ఓటర్ల జాబితాలను తప్పులను సాక్ష్యాధారాలతో ఆయా బీఎల్‌వోలకు ఇచ్చినా సరిగ్గా స్పందించటం లేదంటూ టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారుల దృష్టి సారించి డబుల్ ఎంట్రీల ఓట్లను తొలగించాలని కోరారు.

ఓటు వజ్రాయుధం లాంటిది : తహసీల్దార్

భట్టిప్రోలు, ఫిబ్రవరి 24 : ఓటు హక్కు వజ్రాయుధం లాంటిందని, అలాంటి ఓటు విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని మండల తహసీల్దార్ సీహెచ్ పద్మావతి అన్నారు. స్థానిక టీఎంరావ్ హైస్కూలులో ఓటు హక్కుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నూతనంగా ఓటు హక్కు పొందిన ఓటర్లు ప్రజాస్వామ్యయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. హైస్కూలు వద్ద నుంచి ర్యాలీగా స్థానిక ప్రధాన బస్టాండ్ వరకు వెళ్ళి మానవహారం నిర్వహించారు. అనంతరం మండలంలోని వెల్లటూరు గ్రామ సచివాలయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో తయారు చేసిన ఈవీఎం మిషన్ డెమోను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, ఎంఈవో ఎస్.దేవరాజ్, హెచ్‌ఎం రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయుడు గుర్రం మురళీమోహన్, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత సొసైటీలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి

భట్టిప్రోలు, ఫిబ్రవరి 24 : చేనేత సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించి సంఘాల బలోపేతం చేయాలని దస్తకార్ ఆంధ్ర మార్కెటింగ్ అసోసియేషన్ ప్రతినిధి బి.శ్యామసుందరి అన్నారు. స్థానిక రైలుపేట చేనేత సొసైటీ భవనంలో సహకార సంఘాల భవిష్యత్ అనే అంశపై శనివారం కార్మిక సంఘాల నేతలు, కార్మికులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సహకార సంఘాలకు ఐదు సంవత్సరాలుగా ఎన్నికలు నిర్వహించని కారణంగా సొసైటీల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ సహకార సంఘాలకు ఎన్నికలను నిర్వహించి ఆయా సంఘాల్లో ఉన్న వస్త్ర నిల్వలను ఆప్కో ద్వారా కొనుగోళ్ళు చేసి బకాయిలను చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ అసోసియేషన్ ప్రతినిధి జి.రవీందర్, ఏపీ చేనేత కార్మిక సంఘాల నాయకులు మురుగుడు సత్యనారాయణ, గొట్టుముక్కల బాలాజీ, చేనేత ప్రతినిధులు పడవల మల్లికార్జునరావు, బట్టు సుబ్బారావు, సీహెచ్ శ్రీరంగం, మేనేజర్ బట్టు రామారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 24 : మండలంలోని భట్టిప్రోలు గ్రామ పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరామనామ సంకీర్తన, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు గాలిపాలెం పీఠాధిపతులు శ్రీ చిన్న వెంకయ్యస్వామి శిష్య బృందం పర్యవేక్షణలో మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున మూలమంత్ర, హోమాలతో శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠను వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు నడుమ అంగరంగ వైభవంగా జరిపించారు. శ్రీ సీతారామ కల్యాణాన్ని శాస్త్రయుక్తంగా నిర్వహించారు. ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు. దేవాలయ ట్రస్టీ కుందేటి శ్రీరామకోటి నరసింహారావు, శ్రీసీతారామాలయ కమిటీ సభ్యులు ఉత్సవాలను పర్యవేక్షణ గావించారు.

రాష్ట్రంలో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రావటం ఖాయం

● ఎమ్మెల్యే అనగాని

రేపల్లె, ఫిబ్రవరి 24 : రాష్ట్రంలో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రావటం ఖాయమని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. తాడేపల్లిలోని చంద్రబాబు నివాసంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు సీటు కేటాయించటంపై చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఎన్ని కుట్రలు, కుతంత్రలు చేసినా అంతిమ విజయం ఉమ్మడి కూటమిదేనని అన్నారు. తీరప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గానికి రావాలంటూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కోరారు. సానుకూలంగా స్పందించి ప్రచార భాగంలో హామీనిచ్చారన్నారు.



టీడీపీ, జనసేన అధ్యక్షులైన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తో అనగాని

రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమే

● ఎమ్మెల్యే అనగాని సోదరుడు శివప్రసాద్

రేపల్లె, ఫిబ్రవరి 24 : రానున్న ఎన్నికల్లో జగన్‌ను గద్దె దించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా సిద్ధం కావాలని ఎమ్మెల్యే అనగాని సోదరుడు శివప్రసాద్ అన్నారు. మండలంలోని మృత్యుంజయపాలెం గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేకవిధానాలను ప్రజలకు వివరిస్తూ టీడీపీ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌రెడ్డి పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. అభివృద్ధి చేయకపోగా ఇసుక, మట్టి, మాఫీయాలకు అడ్డాగా చేశారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల 9 నెలల పాలనలో విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ, నిత్యవసర ధరలు, పెట్రోల్, డీజీల్, విపరీతంగా పెరిగిపోయాయని, ఈభారం పేద ప్రజలపై పడటంతో వారి జీవన విధానానికి ఇబ్బందులు పడే విధంగా తయారైందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుర్రం మురహరిరావు, కొలసాని రాము, కమతం శివ, బ్రహ్మేణేశ్వరరావు, దండుప్రోలు పిచ్చియ్య, చిప్పల పార్థసారథి, కేసన రవీంద్ర, యరగళ్ళ మారయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే సోదరుడు శివప్రసాద్

చంద్రబాబునాయుడుతోనే ఉపాధి అవకాశాలు మెరుగు

నగరం, ఫిబ్రవరి 24 : యువతకు ఉపాధి అవకాశాలు కావాలన్నా, మన రాష్ట్రం ప్రగతి పథంలో నడవాలన్నా మరోసారి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమని టీడీపీ రైతు రాష్ట్ర కార్యదర్శి మేకా శివరామకృష్ణ అన్నారు. నగరం మండలంలోని కట్టవ గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి పీవీ చింతారావు, నగరం టీడీపీ అధ్యక్షులు చింతల సుబ్బారావు, సున్నా జయరావు, లుక్కా గుడారంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో ఐదోసారి.. గొట్టిపాటి

వరుసగా 4సార్లు విజయం
రెండు సార్లు కాంగ్రెస్, ఒక సారి వైసీపీ, టీడీపీల నుంచి గెలిచిన రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి24: అద్దంకి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన గొట్టిపాటి రవికుమార్ ఇప్పటి వరకు వరుసగా 4 సార్లు విజయం సాధించి 5 వ సారి రంగంలోకి దిగారు. 2004లో మార్టూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తొలుత రాజకీయ ప్రవేశం చేసి పెద్దనాన్న గొట్టిపాటి హనుమంతరావు కుమారుడు నర్సయ్యపై సుమారు 13,800 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. మార్టూరు నియోజకవర్గం రద్దు కావటంతో 2009 లో అద్దంకి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసి అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిపై సుమారు 15,700 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వైఎస్ మరణానంతరం జగన్ వెంట నడిచిన రవికుమార్ 2014లో వైసీపీ తరపున కరణం బలరామకృష్ణమూర్తి కుమారుడు వెంకటేష్‌పై పోటీ చేసి సుమారు 4 వేల కుపైగా మెజార్టీతో గెలుపొందారు. అనంతరం అధికారపార్టీగా ఉన్న టీడీపీలో చేరారు. 2019 లో టీడీపీ తరపున పోటీ చేసి బాచిన చెంచుగరటయ్యపై సుమారు 13 వేల మెజార్టీతో గెలుపొందారు. వైసీపీ నుంచి టీడీపీలోకి మారిన ఎమ్మెల్యేలలో రాష్ట్రం మొత్తం మీద 2019 ఎన్నికలలో ఒక్క గొట్టిపాటి రవికుమార్ మాత్రమే విజయం సాధించారు. వైసీపీ అధికారంలో ఉండటంతో గత 5 సంవత్సరాలుగా రవికుమార్‌ను ప్రభుత్వం అన్ని విధాలుగా ఇబ్బంది పెడుతూ ఆర్థిక మూలాల పై దెబ్బకొట్టారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. 2024 ఎన్నికలలో అద్దంకి నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గొట్టిపాటి రవికుమార్‌ను తొలి జాబితాలోనే ప్రకటించారు. వరుసగా నాలుగు సార్లు విజయ ఢంకా మోగించిన గొట్టిపాటి రవికుమార్ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తం గా ఉన్న టీడీపీ అనుకూల పవనాలలో భారీ మెజార్టీ ఖాయం అని టీడీపీ శ్రేణులు ఉత్సాహంతో ఉన్నారు.


గొట్టిపాటి రవికుమార్

టికెట్ ప్రకటనతో టీడీపీ నేతల సంబరాలు


అద్దంకి : సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన కూటమి తరపున అభ్యర్థుల ప్రకటన జరగగా, అద్దంకి నుంచి గొట్టిపాటి రవికుమార్ పేరు ప్రకటించటంతో శనివారం రాత్రి టీడీపీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక బంగ్లా రోడ్డు లో అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలుగు తమ్ముళ్లు బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, కాకాని అశోక్, కరిముల్లా, బచ్చల వాసు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ బయోడేటా

పేరు : గొట్టిపాటి రవికుమార్
పుట్టిన తేదీ : 9-11-1973
విద్యార్హతలు: బీటెక్(డిస్‌కంటిన్యూ)
స్వగ్రామం: యద్దనపూడి
నివాసం: చిలకలూరిపేట
తల్లిదండ్రులు: డాక్టర్ శేషగిరిరావు, జయంతిమాల
భార్య: ఝాన్సీ
కుమారులు: హర్షవర్దన్, మహేష్‌బాబు

మూడోసారి ఎన్నికల బరిలో ఏలూరి

టీడీపీ అభ్యర్థిగా ఖరారు చేసిన అధిష్ఠానం
పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు
పలు చోట్ల బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిన కార్యకర్తలు


ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, ఫిబ్రవరి 24: పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు తిరిగి మూడోసారి టిక్కెట్ ఖరారు చేయటంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సంయుక్త ఆధ్వర్యంలో అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఈ ప్రకటనలో పర్చూరు నుంచి తిరిగి ఏలూరికి టిక్కెట్ కేటాయించారు. గత రెండు పర్యాయాలు ఓటమి ఎరుగని నాయకునిగా మంచి గుర్తింపు ఉంది. దీనికి తోడు బాపట్ల పార్లమెంట్ అధ్యక్షునిగా అధినేత అప్పగించిన బాధ్యతలను చాకచక్యంగా నిర్వహిస్తూ అందరినీ కలుపుకుపోయే నాయకునిగా చంద్రబాబు మదిలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. పార్టీశ్రేణులకు అండగా ఉంటూ ముందుకు సాగుతున్నారు. ఇటీవల పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో చంద్రబాబు నిర్వహించిన రా.. కదలి రా సభను విజయవంతం చేయటంలో కీలక భూమిక పోషించారు. 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓటమి చెంది ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల పక్షాన సమస్యలపై అధికారపక్షంతో అలుపెరగని పోరాటం చేస్తూ రాజకీయంగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. దీనికి తోడు ఓటమి ఎరుగని నాయకునిగా చంద్రబాబు మనస్సులో గుర్తింపు ఉంది. దీంతో మూడోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు చంద్రబాబు గ్రీన్‌సిగ్నెల్ ఇచ్చారు.

ఆరు మండలాల శ్రేణుల్లో ...

మూడోసారి తిరిగి ఏలూరి సాంబశివరావుకు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించటంతో నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థిగా సాంబశివరావు పేరును చంద్రబాబు ప్రకటించడంతో మిఠాయిలు పంచి హ్యాట్రిక్ విజయం అంటూ సంబరాలు జరుపుకున్నారు.

టీడీపీ అభ్యర్థి ఏలూరి సాంబశివరావు బయోడేటా

పేరు: ఏలూరి సాంబశివరావు
తల్లిదండ్రులు : ఏలూరి నాగేశ్వరరావు, సుశీలమ్మ
సతీమణి : మాలతి
కుమారులు: దివ్యేష్ బాబు, షైనాంక్ తారక్
సామాజిక వర్గం : కమ్మ
జననం : జనవరి 26, 1977
స్వగ్రామం : కోనంకి గ్రామం, మార్టూరు మండలం, బాపట్ల జిల్లా
నివాసం: 3-37ఎ. ఇసుక దర్శి, మార్టూరు మండలం బాపట్ల జిల్లా.
విద్యార్హత : ఎమ్మెస్సీ హార్టీకల్చర్, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

రాజకీయ ప్రవేశం: 2012లో తెలుగుదేశం పార్టీ తరుపున పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరణ

సాధారణ ఎన్నికల్లో 2014లో పర్చూరు నుంచి వైసీపీ అభ్యర్థి గొట్టిపాటి భరత్‌పై విజయం సాధించి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. (10,775 ఓట్ల ఆధిక్యం)

రెండసారి : 2019 సాధారణ ఎన్నికల్లో తిరిగి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేసి దగ్గుబాటి వెంకటేశ్వరరావుపై ఘనవిజయం సాధించి రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. (1647 ఓట్ల ఆధిక్యం)

మూడోసారి 2024 సార్వత్రిక ఎన్నికలకు తిరిగి తెలుగుదేశం అభ్యర్థిగా బరిలో ఉన్నారు.

ఇసుక దందా కనిపించటం లేదా?

● అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రశ్న

అద్దంకి, ఫిబ్రవరి24: జగన్‌రెడ్డి ఇసుక దందా కలెక్టర్‌ల కళ్లకు కనిపించటం లేదా అని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కేంద్ర పర్యావరణ శాఖ నివేదికపై సీఎం జగన్మోహనరెడ్డి ఏం సమాధానం చెబుతారని రవికుమార్ ప్రశ్నించారు. ఇసుక తవ్వకాలలో పెద్ద ఎత్తున ఉల్లంఘనలు జరుగుతున్నాయని, రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ మదింపు సంస్థ గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ఇసుక తవ్వకాలకు కొత్తగా పర్యావరణ అనుమతులు జారీ చేయలేదని స్పష్టం చేసినా వైసీపీ ఇసుకాసురులు అడ్డగోలుగా అక్రమ రవాణా చేస్తున్నారని ఆరోపించారు. ఇసుక అక్రమదందాలో దోచుకున్న సొమ్ముతో వచ్చే ఎన్నికలలో గెలవాలని జగన్మోహనరెడ్డి కుట్రలు పన్నుతున్నారన్నారు. జగన్ అవినీతికి సహకరించిన ప్రతి అధికారి జైలుకు పోవటం ఖాయం అని అన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ పరివాహక గ్రామాలైన తమ్మవరం, అనమనమూరు, మణికేశ్వరం గ్రామాలలో వైసీపీ నేతలు ఇష్టానుసారం ఇసుక తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. తిమ్మాయపాలెం సమీపంలో బ్రిడ్జి పిల్లర్ల వద్ద కూడా ఇసుక తోడేస్తుండటంతో కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. వచ్చే ఎన్నికలలో టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయం అని రవికుమార్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


చెన్నుపల్లిలో మృత్యుంజయ మహదేవ శివ లింగాన్ని ప్రతిష్టిస్తున్న వేదపండితులు, దాతలు

అంగరంగ వైభవంగా మహదేవ శివలింగ ప్రతిష్ఠ

● పెద్ద ఎత్తున హాజరైన భక్తులు

బల్లికురవ. ఫిబ్రవరి 24 : మండలంలోని కొండాయపాలెం గ్రామానికి చెందిన దూళిపాళ్ల రామగోవిందు ఆధ్వర్యంలో చెన్నుపల్లి చెరువు వద్ద ఉన్న పొలంలో శనివారం ఉదయం 10 గంటల 16 నిమిషాలకు మృత్యుంజయ మహదేవ శివలింగ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతిష్ఠాచార్యులు కారంచేటి పిచ్చయ్య శాస్త్రి పర్యవేక్షణలో ఈ ప్రతిష్ఠ నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. దాత దూళిపాళ్ల రామగోవిందు శివకుమారి దంపతులచే ఈ కార్యక్రమం జరిపించారు. ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని మహా మంత్రాన్ని వేద పండితులు జపించారు.ఈ ప్రతిష్ఠకు గుంటూరు అమ్మ ట్రస్టు నుంచి వేల మట్టి శివలింగాలకు మహారుద్రాభిషేకం నిర్వహించిన బాబా స్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు జలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా అన్నదానం నిర్వహించారు.


ఆట్ల అభిలాష్‌రెడ్డి


భోగిరెడ్డి భవానీశంకర్


ఆట్ల అశోక్‌రెడ్డి

జాతీయ కబడ్డీ పోటీలకు చినగంజాం క్రీడాకారులు

చినగంజాం, ఫిబ్రవరి 24 :మండలంలోని మున్నంవారిపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు కబడ్డీ క్రీడాకారులు జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ కోచ్ చెరుకూరి పుల్లయ్య శనివారం తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన 33వ సబ్ జూనియర్స్ బాలబాలికల కబడ్డీ పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. కబడ్డీ పోటీలలో ప్రతిభ చూపిన ఆట్ల అశోక్‌రెడ్డి, భోగిరెడ్డి భవానీశంకర్, ఆట్ల అభిలాష్‌రెడ్డిలను ఆంధ్రప్రదేశ్ కబడ్డీ జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. మార్చి 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు బీహార్‌లో జరిగే జాతీయ సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో వీరు రాష్ట్ర కబడ్డీ జట్టులో పాల్గొంటున్నట్లు పుల్లయ్య తెలిపారు. జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వరరావు, కోచ్ పుల్లయ్య, సభ్యులు పూలకం రామచంద్రరావు, తుమ్మలపెంట పద్మారావు, కోటేశ్వరరావు, నంగు శ్రీనివాసరెడ్డి, స్వామిరెడ్డిలు అభినందనలు తెలిపారు.

శింగరకొండలో లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, ఫిబ్రవరి 24: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం లక్ష తమలపాకుల పూజ వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం నిర్వహించారు. అనంతరం 11 ఆవృత్తములు గా వేదపండితులు, అర్చకులు లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. పౌర్ణమి తో పాటు శనివారం కూడా కలిసి రావటంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నెరవేరుస్తా

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, ఫిబ్రవరి 24: మూడోసారి పర్చూరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించడానికి అవకాశం కల్పించిన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడికి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లకు టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరి సాంబశివరావు విలేకరులతో మాట్లాడుతూ పార్టీ ఏ నమ్మకంతో తనపై బాధ్యతలు ఉంచి, తనకు మూడోసారి పర్చూరు నుంచి పోటీ చేయడానికి అవకాశం కల్పించిందో ఆ నమ్మకాన్ని తాను నెరవేరుస్తానన్నారు. పర్చూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఐదేళ్లుగా సొంత ప్రయోజనాలకోసం అన్ని వ్యవస్థలను వాడుకొని, వాటిని నిర్వీర్యం చేసిన వైసీపీ అరాచక పాలకులను ఇంటికి పంపించవలసిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రభుత్వ పాలనపై గొంతెత్తి ప్రశ్నించే ప్రజా సంఘాలను, ప్రతి పక్ష పార్టీనేతలను భయపెట్టి వారిపై అక్రమ కేసులను నమోదు చేశారన్నారు. లక్షల కోట్ల రూపాయలను అప్పుగా తెచ్చి రాష్ట్ర భవిష్యత్తును తలకిందులు చేశారన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర అభివృద్ధి చంద్ర బాబు, పవన్ కల్యాణ్‌ల ద్వారానే సాధ్యమవుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి అద్భుతమైన విజయాన్ని అందిస్తుందని, అందు లో పర్చూరు నియోజకవర్గం ఉంటుందని అన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన కారకర్తలు అందరూ పర్చూరులో భారీ మెజారిటీతో అఖండ విజయం అందించడానికి పూర్తి స్థాయిలో కృషి చేయాలని ఏలూరి పిలుపు నిచ్చారు. అంతకు ముందు ఎన్నికల ప్రచారానికి ప్రచార రథాన్ని కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి హరిబాబు, అడుసుమల్లి వెంకట శ్రీను, మిన్నెకంటి రవి కుమార్, గంజి మణికంఠ, తాటి నాగేశ్వరరావు, అడుసుమల్లి నాగ శ్రీహర్ష, పెంట్యాల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


మార్టూరులో పార్టీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న టీడీపీ శ్రేణులు

బాణసంచా కాల్చి సంబరాలు

పర్చూరు నియోజకవర్గంలో మూడోసారి భారీ మెజారిటీతో టీడీపీ బాపట్ల పార్ల మెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును గెలిపించి ఆయనకు హ్యాట్రిక్‌ను బహుమతిగా అందించాలని, రాష్ట్రంలో చంద్రబాబును సీఎంగా మరలా చూడటమే మన లక్ష్యంగా పని చేయాలని పార్టీ నాయకులు పిలుపు నిచ్చారు. శనివారంరాత్రి మార్టూరులో టీడీపీ కార్యాలయం వద్ద మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందంతో బాణ సంచా కాల్చారు. స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పలువురు నాయకులు ప్రసంగించారు. ప్రతి కార్యకర్త రెండు లక్ష్యాలతో పని చేయాలన్నారు. భారీ మెజారిటీతో ఏలూరికి హ్యాట్రిక్ సాధించడంతో పాటు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా ప్రతి కార్యకర్త సైనికుల్లాగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తొట్టెంపూడి భుజంగరావు, రావినేని శ్రీనివాసరావు, గొట్టిపాటి వెంకట్రావు, జంపని శ్రీనివాసరావు, పోలూరి సింగయ్య, షేక్ ఫరూక్, కామినేని జనార్దన్, తేలప్రోలు సాంబ శివరావు, కన్నెగంటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా యద్దనపూడిలో పార్టీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు భారీగా బాణ సంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కనపర్తి నాగేశ్వరరావు, వాసు, సతీష్, కొండల రాయుడు, గుదే తారక రామారావు, కోయ సతీష్, వంశీ, రావి పాటి సీతయ్య, నల్లపనేని రంగయ్య చౌదరి, తదితరులు పాల్గొన్నారు.




వంకాయలపాడులో బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ అనంతరం జరిగిన సభలో మాట్లాడుతున్న దగ్గుమళ్ల ప్రసాదరావు

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి

● దగ్గుమళ్ల ప్రసాదరావు

వంకాయలపాడు(ఇంకొల్లు),ఫిబ్రవరి 24: రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలంలోని వంకాయలపాడు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి దేవతోటి సుందరయ్య అధ్యక్షతన జరిగిన సభలో ప్రసాదరావు మాట్లాడారు. బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ అని అన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌జె.విద్యాసాగర్, దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు నూకతోటి బాబురావు, దేవతోటి నాగార్జున,రాజశేఖర్, డాక్టరు ఐ.బాబురావు, వంకాయలపాటి అంబేద్కర్ యూత్, పర్చూరు, యద్దనపూడి మండలాల ఎస్సీ అధ్యక్షులు గిరి,కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

చినగంజాం, ఫిబ్రవరి 24 : మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో 26వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో యూబీ.వరప్రసాద్ తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

కాలిపోయిన నాలుగు సవర్ల బంగారం, రూ. 30 వేల నగదు వైనం

బల్లికురవ. ఫిబ్రవరి 24 : మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శనివారం పూరి గుడిసె దగ్ధం అయింది. ఈప్రమాదంలో ఇంట్లో బీరువా పూర్తిగా కాలిపోయింది. అందులో ఉన్న నాలుగు సవర్ల బంగారు వస్తువులు, రూ. 30 వేల నగదు బూడిద అయ్యాయి. అందిన సమాచారం మేరకు మల్లాయపాలెం గ్రామ కూడలి సమీపంలో ఊయ్యాల కోటేశ్వరరావు అను ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన నిరుపేద కుటుంబం పూరి గుడిసె వేసుకొని జీవనం సాగిస్తోంది. వారు ఇంటికి తాళం వేసి కూలి పనులకు వెళ్లారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు రేగి ఒక్కసారిగా గుడిసెకు అంటుకున్నాయి. వెంటనే పొరుగున ఉన్న గృహాల వారు ప్రమాదాన్ని గమనించి ట్యాంకర్‌తో నీటిని తెప్పించి మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. అప్పటికే పూరిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది. ఇంటి లోపల బీరువాలో కూలి నాలి చేసుకొని దాచుకొన్న నాలుగు సవర్ల బంగారు వస్తువులు, రూ.30 వేల నగదు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాద వార్త తెలియగానే గ్రామ రెవెన్యూ అధికారి రత్నరాజు సంఘటన స్థలానికి చేరి నిరుపేద కుటుంబాన్ని పరామర్శించారు.ప్రమాదంలో తాము కట్టుబట్టలతో మిగిలామని ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది.


బీరువాలో కాలిపోయిన నగదు బంగారు వస్తువులు

విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలి

● ఏపీ రాష్ట్ర పరీక్షల విభాగం డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 24: పదో తరగతి విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా కష్టపడి చదవి పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరీక్షల విభాగం డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసులు అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆ యన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను పరిశీలించారు. ఈ క్రమంలో పరీక్షలు రాసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం పది విద్యార్థులకు సాయంత్రం తరగతుల సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్థులు, దాతల సహాయంతో అల్పాహారం ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కె. వీరాంజనేయులు, బీసీహెచ్ అంకమ్మరావు, కె. విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.


పది విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న ఏపీ రాష్ట్ర పరీక్షల విభాగం డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసులు

మెరుగైన వైద్యసేవలకు సులువైన మార్గం

- అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బలరాం

చీరాల,ఫిబ్రవరి 24 : పేద, ధనిక తారతమ్యం లేకుండా పాపరాజుతోట తదితర ప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవలు అందేందుకు, సులువైన మార్గంగా నూతన పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉంటుందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు అన్నారు. స్థానిక పాపరాజుతోటలో రూ.120 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు పలువురు కౌన్సిలర్లతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, డీఈ ఏసయ్య, పలువురు కౌన్సిలర్లు, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలరాం, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్ తదితరులు

అభివృద్ధి పనులు వేగవంతం కావాలి

నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం కావాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అధికారులకు సూచించారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో శనివారం ఆయన పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టిన అభివృద్ధి పనుల్లో ప్రధానంగా డ్రైన్లు, ఆర్‌బీకేలు, సీసీ రోడ్లు, సచివాలయ భవనాలు, తాగునీటి వనరుల పనులు తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఎంపీడీవో శోభారాణి, మున్సిపల్ డీఈ ఏసయ్య, పీఆర్ డీఈ శేషయ్య, డ్రైనేజి డీఈ సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వేణుగోపాలరావు, ఏఈ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చీరాల డీఎస్పీగా బేతపూడి ప్రసాద్



చీరాల,ఫిబ్రవరి 24 : డీఎస్పీల బదిలీలలో భా గంగా ప్రస్తుతం ఇంటెలిజెన్స్‌లో పని చేస్తున్న బేతపూడి ప్రసాద్‌ను చీరాల డీఎస్పీగా బదిలీ చేస్తూ శనివారం డీజీపీ కెవి రాజేంద్రనాద్‌రెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. చీరాల డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్. ప్రసాదరావును ఇంటెలిజెన్స్ కు బదిలీ చేశారు. బేతపూడి ప్రసాద్ గతంలో చీరాల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. నేడో రేపో ఆయన చీరాల డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

నేడు ఆత్మీయ సమావేశం

పర్చూరు, ఫిబ్రవరి 24: పర్చూరులోని శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో ఆదివారం అసెంబ్లీ నియోజకవర్గస్థాయి ముస్లిం మైనారిటీలఆత్మీయ సమావేశం జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షులు షేక్.షంషుద్దీన్ శనివారం తెలిపారు.

నాగేశ్వరరావు పంతులు మృతి టీడీపీకి తీరనిలోటు

గంగవరం(ఇంకొల్లు),ఫిబ్రవరి 24: మండలంలోని గంగవరం గ్రామానికి చెందిన టీడీపీ గ్రామమాజీ అధ్యక్షులు, విశ్రాంత ఉపాధ్యాయుడు బోడెంపూడి నాగేశ్వరరావు మృతి పార్టీకి తీరనిలోటు అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు.శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందిన నాగేశ్వరరావు పార్థివదేహాన్ని ఆయన సందర్శించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.తెలుగుదేశం పార్టీ మంచి నాయకుడిని కోల్పోయిందన్నారు. ఆయన అకాల మృతి బాధాకరమన్నారు.ఆయన కుటుంబసభ్యులకు పార్టీ అండగా ఉంటుందన్నారు.

అభ్యర్థిత్వంపై అపోహలు వద్దు

టీడీపీ ఇన్‌చార్జి కొండయ్య

చీరాల,ఫిబ్రవరి 24 : వచ్చే ఎన్నికల్లో చీరాల నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా ఎవరు ఉంటారనే విషయంపై ఎలాంటి అపోహలకు తావులేదు. అధిష్ఠానానికి అన్నీ తెలుసు. సరైన సమయంలో పేరు వెల్లడిస్తారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీకి జనాల్లో పెరుగుతున్న ఆదరణతో కొందరు క్యాడర్‌ను సందిగ్ధంలో పడేసేందుకు ఆడుతున్న మైండ్‌గేమ్‌ను అర్థం చేసుకుంటున్నారన్నారు. భవిష్యత్ టీడీపీదేనన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. సమావేశంలో నాయకులు గంజి పురషోత్తమ్, బొగ్గుల పార్థసారధి, కౌతవరపు జనార్ధనరావు, డేటా నాగేశ్వరరావు, ఉసురుపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

వేటపాలెం(చీరాల),ఫిబ్రవరి 24 : మండలంలోని అక్కాయిపాలెం పంచాయతీ పరిధిలోని పొలాల్లో శనివారం రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యన్నారాయణ, ఎస్సై సురేష్‌లు సిబ్బందితో కలసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.42వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.